క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



అలంకరణలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

కుందుర్పి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సం వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్యహోమం, బలిహరణం, రథంపై కలశ స్థాపన తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, బండమీదపల్లి, కుందుర్పి గ్రామస్తులు పాల్గొని స్వామికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం స్వామి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కళ్యాణదుర్గం: ఉన్నత విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులకు సంబంధించిన వివిధ పుస్తకాలను ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి విద్యార్థులకు అందించారు. స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ విద్య, కోళ్ల పరిశ్రమ, పాడి పరిశ్రమ, కమ్యూనికేషన్ స్కిల్స్, లాజిస్టిక్స్‌కు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. కాగా ఈ పుస్తకాల రచయితలుగా ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీవీఎస్ ప్రసాద్, శ్రీదేవి, చంద్రశేఖర్ ఉండటం గర్వకారణమని ప్రిన్సిపాల్ అన్నారు. అనంతరం పుస్తకాలను అధ్యాపకులకు అందజేశారు.

ఈద్గా గేటుకు బిలాల్ మజీద్ కమిటీ విరాళం

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఈద్గా మైదానంలో కొత్త గేటు ఏర్పాటుకు బిలాల్ మజీద్ కమిటీ విరాళం ప్రకటించింది. స్థానిక ఈద్గా కబరస్తాన్ కమిటీ సభ్యులు మంగళవారం కొత్త గేటు ఏర్పాటు విషయమై బిలాల్ మజీద్ కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా బిలాల్ మజీద్ ముతువల్లి ఎస్.మహమ్మద్ రఫీ, సభ్యులు కలాం, జాఫర్ సాబ్, జిక్రుల్లా మాట్లాడుతూ ఈద్గా మైదానం కొత్త గేటు నిర్మాణ వ్యయం మొత్తం భరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రూ.70 వేలు ఖర్చు అవుతుండగా అడ్వాన్స్ రూపంలో ఈద్గా కమిటీ సభ్యులకు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎస్.మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడు రహీం, సెక్రటరీ పొగాకు ఇబ్రహీం, కోశాధికారి అఫ్జల్, కమిటీ సభ్యులు షేక్షావలి, దాదాఖలందర్, చోటు, వెల్డింగ్ లతీఫ్ పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ల నియామకం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం అర్బన్‌తో పాటు ఐదు మండలాల సచివాలయ కన్వీనర్లను మంత్రి ఉషశ్రీచరణ్ మంగళవారం ఎంపిక చేశారు. కళ్యాణదుర్గం అర్బన్‌కు అర్చన, రూరల్‌కు భట్టువానిపల్లి ఆంజినేయులు, కంబదూరుకు ఎస్. గంగాధర్, కుందుర్పికి ఈ. రాము శెట్టూరుకు పెరుగుపాళ్యం తిమ్మరాజు, బ్రహ్మసముద్రానికిచంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం, సచివాలయం ద్వారా నిరుపేదలకు అందుతున్న సంక్షేమ పథకాల అమలుపై వీరి పర్యవేక్షణ ఉంటుందన్నారు. సచివాలయాల పరిధిలో ఉన్న కన్వీనర్లు, గృహ సారథులు కన్వీనర్ల పర్యవేక్షణలో పనిచేస్తారన్నారు. వలంటీర్లపై అజమాయిషీ లేకుండా పార్టీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయాలని మంత్రి సూచించారు.

బెస్తలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



బెస్త సేవా సంఘ కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు రమణ

ఉరవకొండ: బెస్తలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించని పార్టీలకు బుద్ధి చెబుతామని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి రమణ అన్నారు. మంగళవారం స్థానిక బైపాస్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మండల బెస్త సేవా సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బెస్త సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిప్పయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. బెస్తలను కేవలం ఓటు బ్యాంకుగా రాజకీయ పార్టీలు చూస్తున్నాయని, ఇలాంటి తరుణంలో బెస్తలు మేల్కొని హక్కుల కోసం పోరాడాలన్నారు. అనంతరం బెస్త సేవా సంఘం మండల కమిటీని నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా చంద్ర ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్/కూడేరు: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం కళ్యాణదుర్గం సీడీపీఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని,పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు చెల్లించాలన్నారు. అలాగే కూడేరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

- మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి





శెట్టూరు: బసంపల్లిలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి కేవి ఉషశ్రీచరణ్, కూడేరు: సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

శెట్టూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని బసంపల్లి, మధ్యాహ్నం తిప్పనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఇంటి వద్దకే రేషన్, పింఛన్ ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయా? వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వస్తున్నారా? అంటు ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు వంద శాతం న్యాయం జరగాలనే సంకల్పం జగనన్నదని, ప్రజలను నమ్మించడం, వంచించడం చంద్రబాబు లక్షణమన్నారు. మీకు ఏ నాయకుడు కావాలో నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం మంత్రి బసంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, మాజీ సర్పంచ్ బొమ్మజ్జి రమేష్, , ఉప సర్పంచ్ రామకృష్ణ, సర్పంచ్‌లు తీన్‌మార్ తిమ్మరాజు, గంగన్న, పాలయ్య, గొర్ల గంగాధర, ప్రకాష్, నాగరాజు, సిద్దలింగప్ప, ఎంపీటీసీ బీటీ ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్యామ్‌సుందర్ చౌదరి, హరినాథ రెడ్డి, నాగేంద్ర, దేవిలాల్, దురుగప్ప, లక్ష్మణమూర్తి, మహేంద్ర, మిద్దే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పి.నారాయణపురంలో రూ.4.16 కోట్లతో అభివృద్ధి పనులు

కూడేరు: పి.నారాయణపురం పంచాయతీలో మూడున్నర ఏళ్ల పాలనలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.14.12 కోట్ల లబ్ధి చేకూర్చామని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పి.నారాయణపురంలో సర్పంచ్ హనుమంత రెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 100 రోజులు పూర్తి కావడంతో భారీ సైజ్ కేక్‌ను విశ్వేశ్వరరెడ్డి కట్ చేశారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. నారాయణపురం పంచాయతీలో ప్రజలకు సంక్షేమం పేరిట ప్రభుత్వం రూ.9.96 కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. అలాగే రూ.4.16 కోట్లతో రోడ్లు, సచివాలయ, ఇతర భవనాలు, నాడు–నేడుతో పాఠశాలను అభివృద్ధి పరిచామన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.కోట్లల్లో అభివృద్ధి, సంక్షేమం పేరిట లబ్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అభివృద్ధి జరగలేదని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతున్న వైఎస్సార్ సీపీ విజయాన్ని వచ్చే ఎన్నికల్లో ఆపలేరన్నారు. ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవా, సర్పంచులు రంగారెడ్డి, ఓబుళమ్మ, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణం, వైఎస్సార్‌సీపీ నేతలు తుప్పటి హరీష్, నిర్మలమ్మ, మాధవ రెడ్డి, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, సిద్దారెడ్డి, లోకనాథ్, నాగరాజు, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఓ నవత, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యంలో బుధవారం మధ్యాహ్నం 3గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని వారు కోరారు.

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లిలో బుధవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్న ట్లు ఎంపీపీ నారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎంపీ రంగయ్య హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరుకావాలన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా గౌస్



కూడేరు: మండల ట్రాన్స్‌కో ఏఈగా గౌస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ రాజేష్ గత నెలలో సస్పెండయ్యారు. దీంతో ఇదే మండలంలో సబ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న గౌస్‌కు ఇన్‌చార్జ్ ఏఈగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని రైతుల, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గౌస్ తెలిపారు.

ప్లాట్లు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: హౌసింగ్ లే అవుట్లలో కౌన్సిలర్ల పేర్లు చెప్పి ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని 23వ వార్డు కౌన్సిలర్ పద్మజ డిమాండ్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అంతముందు సమావేశానికి సరిపడ సభ్యులు రాకపోవడంతో వాయిదా వేసి కోరం వచ్చిన తరువాత మళ్లీ మీటింగ్ ప్రారంభించారు. తొలుత అజెండాలోని అంశాలను సిబ్బంది వినిపించగా ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో కౌన్సిలర్ పద్మజ మాట్లాడుతూ ఇటీవల తన వార్డుకు చెందిన ఓ లబ్ధిదారుడి ప్లాట్‌లో కౌన్సిలర్ చెప్పారని కొందరు బేస్‌మట్టం వేసుకున్నట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లకు చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్న ఇలాంటి వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ వార్డు పరిధిలోని ఊట్లకుంట నుంచి మురుగు వాసన అధికమైందని, క్షేత్రస్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. శివారు కాలనీ 32 వార్డుల్లో అవసరమైన మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని కౌన్సిలర్ దేవరాజు కోరారు. 1వ వార్డులో వాణీ స్కూల్‌లో వెళ్లే దారిలో గ్రావెల్‌తో గుంతలు పూడ్చాలని కౌన్సిలర్ నాగవేణి డిమాండ్ చేశారు. కో ఆప్షన్ సభ్యుడు నజీర్ మాట్లాడుతూ 3వ వార్డులో ఉన్న నీటి ట్యాంకు వద్ద కొళాయి లీకేజీలకు మరమ్మతు చేయాలన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రాధాన్యత క్రమంలో వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేలా కౌన్సిల్ సభ్యులు చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రామ్మూర్తి, మేనేజర్ కిశోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఏఈ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



రాయదుర్గంటౌన్: రాధాకృష్ణ హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమారి

రాయదుర్గంటౌన్/రాయదుర్గం రూరల్: పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ బాలికల అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాలికా దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బాలికల దినోత్సవంలో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, మహిళా సాధికారత సమన్వయకర్త ఫరీసా, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలను ఉన్నతంగా చదివించాలి

కళ్యాణదుర్గం: బాలికలను ఉన్నతంగా చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఎంఈఓ విజయకుమారి అన్నారు. పట్టణంలోని స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం భాగ్యమ్మ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పెళ్లి చేయడం, బడి మానిపించి పనులకు పంపడం వంటి వాటికి స్వస్తి పలకాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యా వ్యవస్థ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. అనంతరం బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీవీఈఓ పద్మప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శివలింగాల ప్రతిష్ట



కలశాలతో గంగజలం తెస్తున్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని చంద్రగిరి గ్రామంలో 108 శివలింగాల ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. వేద పండితులు ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు 101 కలశాలతో డప్పు వాయిద్యాల మధ్య గంగాజలం ఊరేగింపుగా తీసుకువచ్చారు. గణపతి పూజ, హోమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం, గురు వారం ప్రతిష్టాపన కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు క్యాంప్ ఇన్‌చార్జ్ తిప్పేస్వామి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నంద్యాలకు చెందిన శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకూ నిర్వహిస్తామన్నారు.

శ్మశాన వాటికకు స్థలాన్ని చూపండి

కళ్యాణదుర్గం: శ్మశాన వాటికకు స్థలాన్ని చూపాలని మండంలోని లక్ష్మీపురం తండావాసులు అధికారులను కోరారు. గ్రామస్తులు వాలేనాయక్, తిప్పేస్వామినాయక్, సిద్దు నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్‌కే రాజు, గురుమూర్తిలతో కలిసి మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ భూషణంకు వినతి పత్రం అందజేశారు. గ్రామం ఏర్పడినప్పటి నుంచి శ్మశాన వాటిక లేదన్నారు. వెంటనే శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వారు కోరారు.

సత్ఫలితాల కోసమే ప్రత్యేక తరగతులు

కళ్యాణదుర్గం రూరల్: పదో తరగతిలో సత్ఫలితాలు సాధించేందుకే రాత్రి వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ విజయకుమారి తెలిపారు. మండలంలోని కొత్తూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం రాత్రి ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ రాత్రి సమయంలో విద్యార్థులు టీవీలు చూడకుండా ప్రత్యేక తరగతులు నిర్వహిసున్నామన్నారు. ఇందుకోసం వలంటర్లు రోజా, సురేష్ స్వచ్ఛందంగా తరగతులు చెప్పడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇదివరకే గోళ్ల గ్రామంలో కూడా ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసిన విషయాన్ని ఎంఈఓ గుర్తు చేశారు.

'ఆశా'ల ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: పట్టణానికి సంబంధించి ఐదు సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న 16 ఆశా వర్కర్ల ఉద్యోగాలకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 16 పోస్టులకు 52 మంది దరఖాస్తు చేసుకోగా 8 దరఖాస్తులు తిరస్కరించారు. మిగితా 40 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ మీనుగ లలితమ్మ, కార్యదర్శి గౌస్ సాహెబ్, డాక్టర్ సాహితీ, డాక్టర్ వినిత, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ గణేష్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనాయక్ ఆధ్వర్యంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. త్వరలోనే మెరిట్ జాబితా విడుదల చేస్తామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు నిమ్మల వెంకటేష్, మోతీలాల్‌నాయక్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి, మాలశ్రీ, అర్చన, సుమలత, లక్ష్మి పాల్గొన్నారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: ఏకాగ్రతతో వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవచ్చని రాయదుర్గం సర్కిల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రామదాసుతో కలసి ఆయన గ్రామస్తులు, వివిధ వాహనాల డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారు ప్రయాణాల్లో సీట్ బెల్ట్ పెట్టుకోవడం తప్పనిసరిగా పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని, అధిక వేగం అత్యంత ప్రమాదకరమని ఆయన వివరించారు.

నేర వార్తలు

ఇంట్లో చోరీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో ఒక ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాల మేరకు.. బొమ్మనహాళ్‌కు చెందిన మంట్లూరి రాజశేఖర్ అనే వ్యక్తి ఈనెల 17న ఇంటికి తాళం వేసుకుని ఎమ్మిగనూరు పట్టణంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీన్ని ఆసరాగా తీసుకున్న గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రెండు బంగారు ఉంగరాలు, 250 గ్రాముల వెండి వస్తువులను అపహరించారు. వాటి విలువ రూ.42 ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హనుమంత నాయక్ తెలిపారు. క్లూస్ టీమ్ ఆధారాల ద్వారా నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి, కూతురు గాయపడ్డారు. ఉరవకొండ మండలం రాసుపల్లికి చెందిన మారెక్క కళ్యాణదుర్గం పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ స్థానికంగా ప్రభుత్వ వసతి గృహంలో ఆశ్రయం పొందుతోంది. స్వగ్రహంలో ఓ కార్యక్రమానికి వెళ్లిన మారెక్కను తండి ఓబులేష్ ద్విచక్రవాహనంలో కళ్యాణదుర్గం తీసుకుస్తుండగా వెనక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టింది. ఘటనలో తండ్రి, కూతురికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బాధితులను 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకుని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

బొమ్మనహాళ్: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై శివ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తూ కిందపడి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కర్ణాటకలోని మొలకల్మూరుకు చెందిన శివ కళ్యాణదుర్గం సమీపంలోని నారాయణపురంలో పని ముగించుకుని తిరిగి వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే అతడిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా మార్కండేయస్వామి జయంతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో స్వామి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భగవాన్ భావనారుషి భద్రావతి నూతన పంచలోహ విగ్రహాల సంప్రోక్షణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అరవ శివప్ప, గౌరవాధ్యక్షుడు సోమ మల్లేశప్ప, ధర్మకర్త ముకుంద, ప్రధాన కార్యదర్శి నాగప్ప, ఉపాధ్యక్షులు, కోశాధికారి, డైరెక్టర్లు, యువజన, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆధార్ సేవలు ప్రారంభం

కణేకల్లు: ప్రజల సౌకర్యార్థం కణేకల్లు–2 సచివాలయంలో ఆధార్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లు–2 సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ఎంపీడీఓ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు మీ సేవ కేంద్రాలకెళ్లి అనేక ఇబ్బందులు పడుతుండటంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలను అందుబాటులో తెచ్చారన్నారు. కొన్ని సేవలు ఉచితంగా మరికొన్ని సేవలు తక్కువ ఫీజుతో చేస్తారన్నారు. గరుడచేడు గ్రామ సచివాలయంలో కూడా ఆధార్ సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకటిరెండ్రోజుల్లో పులచెర్ల సచివాలయంలో కూడా ఆధార్ సేవలు ప్రారంభం కానున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు నిర్మల, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, డిజిటల్ అసిస్టెంట ఉమేష్, కణేకల్లు–2 కార్యదర్శి ఓబుళపతి, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్ఫీలు వద్దు.. ప్రాణాలు ముద్దు!




పెన్నహోబిలం వద్ద జలపాతం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న యువకులు

ఉరవకొండ: ప్రముఖ పర్యాటక పుణ్యక్షేత్రం పెన్నహోబిలం ఆలయానికి ఉమ్మడి జిల్లాల వారితో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయం కింది భాగంలో ఉన్న ఉద్భవ లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం అక్కడే పచ్చని చెట్ల మధ్య పరవళ్ల తొక్కుతూ ఎంపీఆర్ డ్యాం వైపు వెళ్లే తుంగభద్ర అందాలను తిలకించడానికి ఎంతో ఆసక్తి చూపుతారు. అలాగే కుటుంబ సభ్యులతో కలసి అక్కడే విందు ఆరగించి, జలపాతాల వద్ద సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు. సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు జలపాతాల్లోకి పడి ప్రాణాలు కోల్పోతూ..విహారయాత్ర కాస్త విషాదయాత్రగా మారుస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా వీడని నిర్లక్ష్యం

పెన్నహోబిలం జలపాతం వద్ద ఆలయ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, జలపాతం వద్దకు వెళ్లకుండా ముళ్లకంపలు అడ్డుపెట్టారు. అయితే పర్యాటకులు కొందరు ముళ్ల కంపలను తొలగించి జలపాతంలోకి దిగుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పెన్నహోబిలం ఆలయ అధికారుల లెక్కల ప్రకారం గత ఐదేళ్లలో ఆరుగురు జలపాతం వద్ద ప్రమాదవ శాత్తు కాలుజారి నీటి ప్రవాహంలో కొట్టుకోపోయి రెండు, మూడు రోజుల తరువాత వారి మృతదేహాలు లభ్యమైనట్లు చెబుతున్నారు. తాజాగా ఈనెల 12న బుక్కరాయసముద్రం నీలంపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, హిమబిందు కుమార్తె మహిత(14) జలపాతం వద్ద కాలుజారి మృతిచెందింది.

పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి



పెన్నహోబిలానికి వచ్చే పర్యాటకులు జలపాతం వద్ద వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ముళ్ల కంపలు అడ్డంగా పెట్టినా.. వాటిని తొలగించి మరీ జలపాతాల వద్దకు వెళ్తున్నారు. సెల్ఫీలు, ఫొటోల కోసం వెళ్ళి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు, జలపాతం వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఎవరూ అటు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి.

– విజయ్‌కుమార్, ఈఓ, పెన్నహోబిలం